# అభ్యర్థులూ.. జర జాగ్రత్త..!!

- రూ.40 లక్షల పరిమితి దాటొద్దు.. చిక్కుల్లో పడొద్దు
- ప్రచారంలో నీడలా వెంటాడుతున్న వ్యయ పరిశీలన బృందాలు

సిటీబ్యూరో, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ) : నామినేషన్ల ప్రక్రియ ఊపందుకున్న దరిమిలా అభ్యర్థులను వ్యయ పరిశీలకులు నీడలా వెంటాడుతున్నారు. సభలు, ర్యాలీలు, ఇంటింటి ప్రచారం, కార్యకర్తల భోజనాలు, వాహనాల కేటాయింపులతో ప్రచారం హోరెత్తిస్తున్న తరుణంలో అభ్యర్థుల లెక్క పక్కాగా లెక్కించేందుకు గానూ ఈ బృందాలు డేగ కన్ను వేశాయి. అభ్యర్థులు హద్దులు దాటకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాలు విడుదల చేసింది. నిర్దేశించిన రూ.40లక్షల ఖర్చుపై అమలవుతున్న తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించడానికి ప్రత్యేక తనిఖీ బృందాలను నియమించింది. ఈ బృందాలు నిత్యం అభ్యర్థుల ఖర్చును లెక్కిస్తూ ఉన్నారు. రోజూ ఎవరెంత ఖర్చు చేస్తున్నారో వీడియో దృశ్యాల ఆధారంగా లెక్క గడుతున్నారు. ఎన్ని కుర్చీలు, టెంట్లు వేశారు. ఎన్ని మైక్ సెట్లు పెట్టారు. ఎన్ని వాహనాలు వినియోగించారు. ఎంత మందికి భోజనాలు ఏర్పాటు చేశారనేది ఖర్చు లెక్కించి షాడో రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నారు. అభ్యర్థులు కూడా పోలింగ్ నాటికి ఖర్చు వివరాలను మూడు విడతల్లో ఆడిట్ బృందాలతో తనిఖీలు చేయించుకోవాల్సి ఉంటుంది.

### 40 లక్షల లెక్కా పక్కా..

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని 1951లో రూపొందించారు. ఏ అభ్యర్థి ఎంతమేర ప్రచారానికి ఖర్చు పెట్టాలనేది నిర్దేశిస్తూ సెక్షన్ 19లో వివరించారు. ఎన్నికలు జరిగే సమయంలో ధరలకు అనుగుణంగా వాటిని వెల్లడిస్తారు. ప్రస్తుతం ఎమ్మెల్యే బరిలో నిలిచే అభ్యర్థి వ్యయ పరిమితి రూ.40లక్షలుగా నిర్ణయించింది. 2018 ఎన్నికల్లో ఇది రూ. 28 లక్షలుగా ఉండేది. పోటీలో నిలబడే అభ్యర్థి ఈసీఐ వ్యయ పరిమితి దాటి ఖర్చు చేసినా, వాటికి సంబంధించిన లెక్కలను సరైన ఆధారాలతో సమర్పించకున్నా అభ్యర్థులపై వేటు పడుతుంది.

### నామినేషన్ దాఖలైనప్పటి నుంచి..

ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసినప్పటీ నుంచి ఖర్చును లెక్కిస్తారు. దీనికోసం అభ్యర్థి ఏదేని జాతీయ బ్యాంకులో నూతన ఖాతా తెరవాలి. ఈ లావాదేవీలు ఆ ఖాతా ద్వారానే నిర్వహించాలి. నామినేషన్‌కు ముందు అభ్యర్థులు చేపట్టిన ప్రచారాలు, సభలు, ఇతర కార్యక్రమాల ఖర్చును సంబంధిత పార్టీల ఖర్చు కింద జమ చేస్తారు. ఎన్నికల వ్యయ పరిశీలకులు ఎప్పటికప్పుడు నమోదు చేస్తారు.



ఉప్పల్ మల్లాపూర్‌లోని వీఎన్ఆర్ గార్డెన్‌లో బుధవారం ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన మహిళల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, ఉప్పల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సమ్మేళనానికి హాజరైన మహిళలంతా బీఆర్ఎస్‌దే గెలుపు అంటూ.. పెద్ద ఎత్తున మద్దతు తెలిపారు.

### 30 రోజుల్లోగా లెక్కలు చూపాలి

ఫలితాలు వెల్లడైన 30 రోజుల్లోపు ప్రతి అభ్యర్థి తమ వ్యయ వివరాలను బిల్లులతో సహా అధికారులకు అప్పగించాలి. పరిమితికి మించి ఖర్చు చేసినా, లెక్కలను సరైన సమయంలో చూపకున్నా ఆ అభ్యర్థులపై వేటు పడటంతోపాటు తర్వాత ఎన్నికల్లో పోటీ చేసే అర్హత కూడా కోల్పోతారు.

### ధరలు ఇలా..

స్థానికంగా ఉన్న ధరల ప్రకారం.. ఖర్చును లెక్కగడుతారు.. జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో ఆయా రాజకీయ పార్టీల సమక్షంలో ఈనెల 17న స్థానికంగా ఉన్న ధరలను బట్టి నిర్ణయించారు.

**43 అంశాల్లో ప్రధానమైనవి**

- లౌడ్‌స్పీకర్లు, 400 వాట్స్ గల రెండు బాక్స్‌లకు రోజుకు రూ.4,200
- 700 వాట్సాప్‌తో నాలుగు బాక్స్‌లకు రూ.7,200 ఆటో రిక్షాలపై పోస్టర్ల ప్రచారం
- బ్లాక్ స్టిక్కర్లతో నెలకు గానూ రూ.450
- రెగ్జిన్ హుడ్ నెలకు రూ.1300
- బ్లాక్‌లైట్ డిస్‌ప్లే మూడు నెలలకు రూ.4,000
- రెగ్జిన్‌హుడ్ మూడు నెలలకు రూ.4,000
- పిల్లర్స్ బోర్డుకు రెండువైపులా మూడు నెలలకు రూ.5,900
- వాల్ పెయింటింగ్ –ఇందులో ఐదు కేటగిరిలు ఉండగా.. రూ.2వేల నుంచి 3,800 నిర్ణయించారు.
- కటౌట్లకు రూ.8,500, ప్రవేశద్వారాల వద్ద ఏర్పాటు చేస్తే రూ.12,500 లెక్కిస్తారు.
- టెంట్‌కు రూ.4,920

### భోజనాలు

- పుల్‌మీల్స్/చికెన్ కర్రీ రూ.125 (వ్యక్తికి)
- పుల్‌మీల్స్/మటన్ కర్రీ రూ.150

**రోజుకు వాహనాల వినియోగం రేట్ల వివరాలు**

| వాహన కేటగిరి | నిర్ణీత ధర (రూ.ల్లో) |
|---|---|
| టాటా ఇండికా | 1,340 |
| క్వాలీస్ | 1,560 |
| బొలేరో | 1,560 |
| స్కార్పియో | 1,560 |
| టవేరా, ఇన్నోవా | 1,560 |
| మోటార్ క్యాబ్స్ | 1,560 |
| టాటా సుమో | 1,560 |
| అంబాసిడర్ | 1,340 |
| మాక్సీ క్యాబ్స్ | 1,900 |
| జీపు మహేంద్ర | 1,340 |
| ఆటో రిక్షా | 390 |
| బస్సు | 4,360 |
| మినీ లారీ | 1,900 |
| గూడ్స్ వెహికల్స్ | 2,240 |
| ట్రాక్టర్ | 1,900 |
| డ్రైవర్ బత్త/క్లీనర్ బత్తా | 330 |

### సమావేశ మందిరాలు

- ఫంక్షన్‌హాల్ (చిన్నది) రోజుకు రూ.6,200
- ఫంక్షన్‌హాల్ (పెద్దది) రూ.62,000
- ఏసీ ఫంక్షన్‌హాల్ రూ.1,25,000
- క్యాంపెయిన్ కార్యాలయానికి రూ.9,000

## బీఆర్ఎస్ అంటే భరోసా.. సీఎం కేసీఆర్ అంటే నమ్మకం

- కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి
- కండ్లకోయలో ఎన్నికల ర్యాలీ



కండ్లకోయలో మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్ రూరల్, నవంబర్ 8 : తెలంగాణ ప్రజలను అన్ని విధాల ఆదుకున్నది సీఎం కేసీఆర్ ఒక్కరేనని, ఇక ముందు కూడా ఆదుకునేది సీఎం కేసీఆరేననే నమ్మకం ప్రజల్లో ఉందని కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలోని కండ్లకోయలో బుధవారం రాత్రి ఎన్నికల ప్రచారంలో భాగంగా వేలాది మందితో మంత్రి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో పేద ప్రజలు కష్టాలు పడకూడని, దేశంలో ఎక్కడాలేని పథకాలు తెలంగాణలో సీఎం కేసీఆర్ అమలు చేశారన్నారు. పుట్టిన పసి పాప నుంచి వృద్ధుల వరకు వివిధ పథకాలు తీసుకొచ్చి ఆర్థికంగా ఆదుకున్నారని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ఉపాధి అవకాశాలు, వ్యవసాయ రంగానికి ప్రోత్సాహంతో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా మారిందన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని తెలిపారు. మరిచిపోయి కాంగ్రెస్‌కు ఓటు వేస్తే అది మోరీల వేసినట్టేనని, ఎన్నికలప్పుడు వచ్చి చెప్పే మాయమాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలను కోరారు. ఇక్కడ ఎంపీగా గెలిచిన రేవంత్ అనంతరం ఒక్కసారి కూడా ప్రజల వద్దకు వచ్చిన పాపానపోలేదని, పీసీసీ తీసుకుని ఎమ్మెల్యే టికెట్లు అమ్ముకుంటుండని ఆరోపించారు.

### సంపద పెంచిండు.. ప్రజలకు పంచిండు..

సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడంతో ఆర్థికంగా బలపడి రాబడి పెరిగిందని మంత్రి మల్లారెడ్డి తెలిపారు. హైదరాబాద్ నగరాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసి, నంబర్ వన్ సిటీగా మార్చారన్నారు. నగరంతోపాటు తెలంగాణలో సంపదను పెంచి, వచ్చిన సంపదను పథకాల ద్వారా పేదలకు పంచారని తెలిపారు. మంత్రికి గ్రామంలో నాయకులు ఘన స్వాగతం పలుకగా, మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రభాకర్ భారీ గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గుండ్లపోచంపల్లి మున్సిపల్ చైర్మన్ లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ ప్రభాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ యాదవ్, కౌన్సిలర్లు మల్లికార్జున్ ముదిరాజ్, జైపాల్‌రెడ్డి, వీణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్ యాదవ్, మున్సిపల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నరేందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నేతల్లో సయోధ్య కరువు

- అయోమయంలో జిల్లా పార్టీ శ్రేణులు
- ప్రచారంలో దూసుకుపోతున్న బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు

మేడ్చల్, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో అంతటా కాంగ్రెస్ నేతల మధ్య సయోధ్య కరువు కావడంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అయోమయానికి గురవుతున్నారు. జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఉప్పల్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ ప్రచారం అంతంతమాత్రంగా కొనసాగుతున్నది. మరోవైపు బీఆర్ఎస్ అభ్యర్థులైన మంత్రి మల్లారెడ్డి, కేపీ.వివేకానంద్, మాధవరం కృష్ణారావు, మర్రి రాజశేఖర్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి సభలు, ఇంటింటి పాదయాత్రలు చేస్తూ ప్రచారంలో దూసుకుపోతున్నారు. దీనికి భిన్నంగా కాంగ్రెస్ పరిస్థితి ఉన్నది. కాంగ్రెస్ పార్టీ టికెట్లు కేటాయించి వారాలు గడిచినా అభ్యర్థులకు ద్వితీయ శ్రేణి నాయకులతో సయోధ్య కుదరడంలేదు. అధిష్ఠానంతోపాటు అభ్యర్థులు బుజ్జగింపులు చేస్తున్నా కాంగ్రెస్ నాయకులు మాత్రం దిగిరావడంలేదు. మేడ్చల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశించి భంగపడిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు హరివర్ధన్‌రెడ్డి స్వతంత్రంగా ప్రచారం చేస్తున్నారే తప్ప ముఖ్య నాయకులతో కలువడంలేదు. ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన నక్క ప్రభాకర్‌గౌడ్ పార్టీకి ఆశించిన మేరకు పని చేయకుండా పక్క పార్టీల వైపు చూస్తున్నట్లు తెలుస్తున్నది. కూకట్‌పల్లిలో బండి రమేశ్‌కు కాంగ్రెస్ టికెట్ కేటాయించడంతో గందరగోళానికి దారి తీసింది. కాంగ్రెస్ నాయకుడు గొట్టిముక్కల వెంగళరావు బీఆర్ఎస్‌లో చేరడంతో ఆయన క్యాడరంతా బీఆర్ఎస్ వైపు మళ్లింది. ఉప్పల్‌లో రాగిడి లక్ష్మారెడ్డి బీఆర్ఎస్‌లో చేరికతో కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లోకి భారీగా చేరారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో మైనంపల్లి హన్మంతరావుకు కాంగ్రెస్ టికెట్ ఇవ్వడంతో నందున బీసీ నాయకుడైన నందికంటి శ్రీధర్ బీఆర్ఎస్‌లో చేరిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నుంచి అనేక మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. దీంతో మల్కాజిగిరిలో బీఆర్ఎస్ పార్టీ మరింత పటిష్టంగా మారింది.

### ఏనాడు గాంధీ భవన్ మెట్లెక్కని వారికి టికెట్లా?

## టీపీసీసీ ఉపాధ్యక్ష పదవికి జగదీశ్వర్‌రావు రాజీనామా

*బీఆర్ఎస్ నేతలతో సమావేశం*



సంగిశెట్టి జగదీశ్వర్‌రావుతో సమావేశమైన బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్, ఎమ్మెల్సీలు ఎల్.రమణ, ఎంఎస్.ప్రభాకర్

ముషీరాబాద్, నవంబర్ 8 : ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంగిశెట్టి జగదీశ్వర్ రావు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. పార్టీ టికెట్ల విషయంలో అధిష్టానం తీరుపై మండిపడుతున్న ఆయన ఈ మేరకు ముషీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్, ఎమ్మెల్సీలు ఎల్.రమణ, ఎంఎస్.ప్రభాకర్, దాసోజు శ్రావణ్‌తో బుధవారం సమావేశమై బీఆర్ఎస్ పార్టీలో చేరడానికి సుముఖత వ్యక్తం చేశారు. ఏ నాడు గాంధీ భవన్ మెట్లెక్కని వారికి పార్టీ టికెట్‌లు అమ్ముకుంటున్నారని మండిపడ్డారు. దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం పని చేస్తున్న తనకు ముషీరాబాద్ టికెట్ ఇవ్వకుండా కాంగ్రెస్ పెద్దలు అన్యాయం చేశారంటూ ఆవేదన వ్యక్తం చేస్తూ పార్టీ అధిష్టానానికి రాజీనామా లేఖ రాశారు. కాగా, కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన సంగిశెట్టి జగదీశ్వర్‌రావుతో ముషీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్, ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్, దాసోజు శ్రావణ్ సమావేశమై బీఆర్ఎస్‌లోకి రావాలని ఆహ్వానించారు. అందుకు అంగీకరించిన ఆయన ఒకటి రెండు రోజుల్లో బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రావణ్‌కుమార్, ఎక్కాల కన్నా, ముఠా జయసింహ పాల్గొన్నారు.

## బీజేపీకి ఓబీసీ మోర్చా

గీతా సెల్ రాష్ట్ర కోకన్వీనర్ రాజీనామా



సమావేశంలో మాట్లాడుతున్న యాదగిరి గౌడ్

చిక్కడపల్లి, నవంబర్ 8 : బీజేపీకి రాజీనామా చేస్తున్నట్లు ఓబీసీ మోర్చా గీతా సెల్ రాష్ట్ర కోకన్వీనర్ బి.యాదగిరి గౌడ్ ప్రకటించారు. ఆయనతోపాటు గాంధీనగర్ డివిజన్ బాపునగర్, వివేక్‌నగర్, జవహర్‌నగర్‌లో ఉన్న పార్టీ శ్రేణులు 150 మంది కూడా రాజీనామా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. బుధవారం బాపూనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీలో తగిన గుర్తింపు లేకపోవడం వల్లనే రాజీనామా చేశానని తెలిపారు. ఈ కార్యక్రమంలో శంకర్ గౌడ్, గణేశ్, మనోహర్, ప్రకాశ్, వినోద్, శివశంకర్ గౌడ్, గోపాల్ గౌడ్, యాదయ్య, పవన్ కల్యాణ్, లక్ష్మి, అనిత తదితరులు పాల్గొన్నారు.